# కొనుగోలు కేంద్రాల కోసం అన్నదాతల ఎదురుచూపు





కల్లాల్లో ఆరబోసిన ధాన్యం

పర్ణశాల, డిసెంబర్ 12: వరి కోతలు కోసి కల్లాల్లో ఆరబోసిన ధాన్యం అమ్మే సమయంలో తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తే రైతులు ధాన్యాన్ని అమ్మేవారు, కానీ అధికారుల నిర్లక్ష్యం వల్ల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దళారులు తక్కువ ధరకే ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను మోసం చేస్తున్నారన్నారు. ఇప్పటికే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉండగా ఎక్కడ ఏర్పాటు చేయలేదని రైతులు వాపోతున్నారు. మండలంలో 21 వేల ఎకరాల్లో వరి సాగు చేయగా సుమారు 13 వేల ఎకరాల్లో వరి కోతలు పూర్తయ్యాయని, రైతుల వద్ద ధాన్యం ఉన్నప్పుడే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యం సేకరణ చేయాలని రైతులు కోరుతున్నారు.

## కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



ధాన్యం కొనుగోలు కేంద్రాలను త్వరగా ఏర్పాటు చేయాలి. తుఫాన్ ప్రభావంతో కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం రాశులు తడిసిపోయాయి. ఇప్పటికే రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని తక్కువ ధరకు ప్రైవేట్ దళారులు కొనుగోలు చేస్తున్నారు. అధికారులు స్పందించి రైతుల వద్ద నుంచి ధాన్యాన్ని త్వరగా సేకరించాలి. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ధాన్యం మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్‌గా ఇస్తామని ఎన్నికల హామీ ఇచ్చారు. ఆచరణలో పెడితే రైతులకు లాభసాటిగా ఉంటుంది.

- తెల్లం సీతమ్మ, జడ్పీటీసీ

## తడిసిన ధాన్యానికి మద్దతు ధర ఇవ్వాలి



ఇటీవల తుఫాన్ ప్రభావం వల్ల రైతులు భారీగా నష్టపోయారు. రైతుల ధాన్యం కల్లాల్లోనే తడిసి మొలకెత్తాయి. ప్రభుత్వం త్వరగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి మద్దతు ధర ఇవ్వాలి. నిర్లక్ష్యం చేస్తే దళారులు అదనుగా చూసుకొని రైతుల నుంచి తక్కువ ధరకే ధాన్యాన్ని కొనుగోలు చేస్తారు. దీంతో రైతులు నష్టపోతారు. అధికారులు ఇప్పటికైనా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి దళారుల చేతిలో నష్టపోకుండా రైతులను ఆదుకోవాలి.

- శ్రీను, రైతు, చిన్నబండిరేవు

## గిట్టుబాటు ధర నిర్ణయించాం



ఈ విషయంపై మండల వ్యవసాయ శాఖాధికారి నవీన్‌ను వివర కోరగా... వరి ధాన్యంలో ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2203, బీ గ్రేడ్ ధాన్యానికి రూ.2183 గిట్టుబాటు ధర నిర్ణయించాం. ధాన్యం కొనుగోలు కేంద్రాలు సివిల్ సప్లయ్ ఆధ్వర్యంలో జరుగుతాయి. మండలంలో 11 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశాం. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం.

- నవీన్ మండల వ్యవసాయశాఖాధికారి

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

భద్రాచలం, డిసెంబర్ 12: ఏటపాకలోని 132 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు జరుగుతున్న దృష్ట్యా బుధవారం ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు భద్రాచలం పట్టణంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఎన్పీడీసీఎల్ డీఈ జీవన్‌కుమార్ మంగళవారం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

## ఆలయాల్లో ప్రత్యేక పూజలు

చర్ల,డిసెంబరు12: పవిత్ర కార్తీకమాసం చివరిరోజు మంగళవారం మండలంలోని ఆలయాల్లో భక్తులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయిల్‌బంక్ ఏరియాలోని అభయాంజనేయస్వామి ఆలయం, పాతచర్ల ఉమారామలింగేశ్వరస్వామి, తేగడ భద్రకాళీ వీరభద్రస్వామి, కలివేరు, లింగాల శివాలయాల్లో పూజలు జరిపారు. ఆకాశదీజ్వాలా తోరణం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## తపాలా ఉద్యోగుల సమ్మె

దుమ్ముగూడెం, డిసెంబర్ 12: కనీస వేతనాలు కల్పించాలని మండలంలో గ్రామీణ తపాలా ఉద్యోగులు మంగళవారం నిరవధిక సమ్మె నిర్వహించారు. తపాలా జేఏసీ పిలుపుమేరకు తపాలా ఉద్యోగులు నిరవధిక సమ్మె చేపట్టడంతో తపాలాశాఖలో అన్ని సేవలు నిలిచిపోయాయి. ఏఐజీఎస్‌వీ, ఎన్ఎఫ్‌జీడీఎస్ సీహెచ్ విద్యాసాగర్, ఎస్‌వీ కోటిరెడ్డి, బీపీఎం, ఏబీపీఎంల ఆధ్వర్యంలో నిరవధిక సమ్మె చేపట్టారు.

**మణుగూరు టౌన్‌లో..**

మణుగూరుటౌన్, డిసెంబర్ 12: తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని జీడీఎస్‌పీ జేసీపీ దేశవ్యాప్త పిలుపులో భాగంగా మణుగూరు మండలం తపాలా ఉద్యోగులు మంగళవారం పోస్టాఫీస్ ఎదురుగా సమ్మె చేపట్టారు. వారు మాట్లాడుతూ.. పెన్షన్, 8గంటల పనివిధానంతోపాటు అన్ని ప్రయోజనాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇన్సెంటీవ్, కమిషన్ పద్ధతిని రద్దుచేసిన జీడీఎస్‌లు చేసే ప్రతి పనిని వర్క్‌లోడ్ పరిధిలోకి తీసుకోవాలన్నారు. ఉద్యోగులపై వేధింపులు ఆరికట్టాలని, రూ.5లక్షలవరకు బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. తపాలా ఉద్యోగులు, జీడీఎస్‌పీ జేసీపీ నాయకులు పాల్గొన్నారు.

# ప్రతి కార్మికుడు టీబీజీకేఎస్‌కు అండగా నిలవాలి

**మణుగూరు ఏరియా బ్రాంచి ఉపాధ్యక్షుడు పూకంటి ప్రభాకర్‌రావు**



మాట్లాడుతున్న ఏరియా బ్రాంచి ఉపాధ్యక్షుడు ప్రభాకర్‌రావు

మణుగూరుటౌన్, డిసెంబర్ 12: కేసీఆర్ నాయకత్వంలో, తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం(టీబీజీకేఎస్) గౌరవ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చొరవతో సింగరేణిలో అసాధ్యమైన హక్కులు సాధించిన సంఘానికి గుర్తింపు సంఘం ఎన్నికల్లో ప్రతి ఒక్క సింగరేణి కార్మికుడు అండగా నిలవాలని మణుగూరు ఏరియా బ్రాంచి ఉపాధ్యక్షుడు పూకంటి ప్రభాకర్‌రావు అన్నారు. మంగళవారం మణుగూరు ఏరియా కొండాపురం భూగర్భగనిలో పిట్ సెక్రెటరీ నాగెల్లి వెంకట్ అధ్యక్షతన నిర్వహించిన గేట్ మీటింగ్‌లో మాట్లాడారు. కొండాపురం భూగర్భగని టీబీజీకేఎస్ ప్రత్యేక చొరవతోనే పునఃప్రారంభించడం జరిగిందన్నారు. అండర్‌గ్రౌండ్ ఫిట్టర్, ఎలక్ట్రీషియన్ కార్మికులకు సర్వేస్ పదోన్నతులు ఇప్పించామని, గనిలో అంబులెన్స్ సౌకర్యం టీబీజీకేఎస్ చొరవతోనే సాధ్యమైందన్నారు. రానున్న రోజుల్లో కార్మికుల పక్షాన నిలిచి కొత్త హక్కులు సాధించుకునేందుకు టీబీజీకేఎస్‌ను బాణం గుర్తుపై ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కేంద్ర డిప్యూటీ జనరల్ సెక్రెటరీ అబ్దుల్ రవూఫ్, నాయకులు లక్ష్మణ్, ప్రసాద్, చాంద్‌పాషా, ఆర్ శ్రీనివాస్, టీ శ్రీనివాసరావు, రత్న, అజీజ్, బంగారి పవన్‌కుమార్, మునిగెల నాగేశ్వరరావు, సీ రమేశ్, శృంగారం సతీశ్, హుస్సేన్‌రెడ్డి, దిలీప్, రాజేశ్, గాంధీ, మహేశ్, ఎస్ నవీన్, అజ్మీరా వెంకటేశ్వర్లు, వేముల భాస్కర్‌రావు పాల్గొన్నారు.

## అంతర్ జిల్లా దొంగ అరెస్ట్

**15తులాల బంగారం, బైక్ స్వాధీనం**

భద్రాచలం, డిసెంబర్1: తప్పించుకు తిరుగుతున్న అంతర్ జిల్లా దొంగను పోలీసులు అదుపులోకి తీసుకొని, అతని వద్ద నుంచి 15తులాల బంగారు ఆభరణాలను, ఒక ద్విచక్రవాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టణ సీఐ నాగరాజ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నెల రోజుల క్రితం భూపాలపల్లికి చెందిన దురిశెట్టి స్వామి నిరంజన్ అనే దొంగ, మరి కొంత మంది పట్టణంలోని గోల్డ్ స్మిత్ కాలనీలో ఉండే మాధవరావు అనే వ్యక్తి ఇంట్లో తాళం పగలకొట్టి ప్రవేశించారు. ఇంట్లోని బీరువా పగులగొట్టగా ఏమీ లేకపోవడంతో ఇంటి ముందు నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనాన్ని (హోండా షైన్) దొంగిలించాడు. దీనిపై మాధవరావు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో గత నెల 20న దొంగతనం చేసిన ముగ్గురు వ్యక్తులు మైపా నవీన్, పూజారి సూర్యప్రకాశ్, సాయి తేజను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో మొదటి ముద్దాయి అయిన దురిశెట్టి స్వామి నిరంజన్‌ను మంగళవారం బ్రిడ్జి సెంటర్‌లోని అటవీ శాఖ చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గతంలో తాను పలు దొంగతనాలకు పాల్పడినట్లు, జైలుకు కూడా వెళ్లి వచ్చినట్లు ఒప్పుకున్నాడు. ఈ కేసుతో పాటు మణుగూరు, గోదావరి ఖనిలో కూడా దొంగతనాలు చేసి, దొంగిలించిన సొత్తును తన స్నేహితుడు అయిన సాయితేజకు ఇచ్చి అమ్మి సొమ్ములు తీసుకురావాలని వస్తుండగా పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 15తులాల బంగారు ఆభరణాలు, ఒక ఫ్యాషన్ ప్రో బైక్‌ను పోలీసులు స్వాధీనం చేసుకొని, రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో పట్టణ ఎస్సై పీవీఎన్ రావు పాల్గొన్నారు.

**వివాహిత అదృశ్యం**

భద్రాచలం, డిసెంబర్ 12: పట్టణంలోని లంబాడీ కాలనీకి చెందిన ఓ వివాహిత అదృశ్యమైన ఘటన రెండు రోజుల క్రితం పట్టణంలో చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాలు... లంబాడీకాలనీకి చెందిన వివాహిత రెండు రోజుల క్రితం తన భర్త పనికి వెళ్లగా తన కూతుర్ని వెంటబెట్టుకొని సారపాకలోని తల్లి గారింట వద్ద వదిలి వెళ్లింది. భద్రాచలంలోని తన ఇంటికి తిరిగి వచ్చి బట్టలు తీసుకొని వెళ్లిపోయింది. ఈ విషయమై వివాహిత తల్లి మంగళవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**పేకాటరాయుళ్ల అరెస్ట్**

భద్రాచలం, డిసెంబర్ 12: పట్టణంలోని వెంకటేశ్వర కాలనీలో ఒక ఇంట్లో పేకాట ఆడుతున్న వారిని పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందడంతో పేకాట ఆడుతున్న ఇంటిపై దాడిచేసి పేకాట ఆడుతున్న 10మందిని అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి రూ. 9,520, పేక ముక్కలు, 6ద్విచక్ర వాహనాలను, ఒక ఆటో, 9 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వారిపై పట్టణ సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## భద్రాద్రి రామయ్యకు నిత్య కల్యాణం



రామయ్యకు కల్యాణం జరిపిస్తున్న అర్చకుడు

భద్రాచలం, డిసెంబర్ 12: భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానంలో మంగళవారం సీతారాముల నిత్యకల్యాణాన్ని అర్చకులు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాతం పలికి, ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్య పూజలు, నిత్య హోమాలు, నిత్య బలిహరణం తదితర కార్యక్రమాలను జరిపారు. అనంతరం స్వామివారి నిత్య కల్యాణ మూర్తులను బేడా మండపానికి తీసుకొచ్చి శాస్త్రోక్తంగా నిత్య కల్యాణం జరిపారు. కల్యాణంలో పాల్గొన్న దంపతులకు స్వామివారి ప్రసాదాలు, శేష వస్త్రాలు అందజేశారు.

**నేటి నుంచి నిత్య కల్యాణాలు రద్దు**

భద్రాచలం సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో ముక్కోటి ఏకాదశి అధ్యయనోత్సవాల సందర్భంగా బుధవారం నుంచి 23వ తేదీ వరకు (పది రోజుల పాటు)స్వామికి నిర్వహించే నిత్య కల్యాణాలను నిలిపి వేయనున్నట్లు దేవస్థానం ఈవో రమాదేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 24వ తేదీ నుంచి యధావిధిగా స్వామివారి నిత్య కల్యాణం నిర్వహిస్తామన్నారు.

## ఎమ్మెల్యే తెల్లంకు సన్మానం



ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావును సత్కరిస్తున్న విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులు

భద్రాచలం, డిసెంబర్ 12: భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావును రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ సభ్యులు మంగళవారం సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మీ అందరి సహకారంతోనే ఎమ్మెల్యేగా విజయం సాధించానని కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు భూషణరావు, నాయకులు భూపతిరావు, వెంకన్న, ఖాదర్, రామచంద్రరావు, శేఖర్, మాణిక్య కుమారి, కన్నయ్యలాల్, కృష్ణ, వెంకటయ్య, రాజు పాల్గొన్నారు.

**రావులపల్లి దంపతులకు ఎమ్మెల్యే సత్కారం**

భద్రాచలం, డిసెంబర్ 12: భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావును భద్రాచలం బీఆర్ఎస్ నాయకులు రావులపల్లి రాంప్రసాద్ దంపతులు అల్పాహారానికి ఆహ్వానించారు.


## ముత్యాలమ్మకు ఎమ్మెల్యే పాయం పూజలు

దుమ్ముగూడెం, డిసెంబర్ 12: దుమ్ముగూడెంలోని ముత్యాలమ్మ అమ్మవారిని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు దంపతులు మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ కమిటీ నిర్వాహకులు పాయం దంపతులను స్వాగతం పలికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లంకా శ్రీనివాసరావు, ఆలయకమిటీ అధ్యక్షుడు చుక్కా గణేశ్‌రెడ్డి, నాయకులు శివకుమార్, సంపత్, రాము, సందీప్, శివప్రసాద్ ఉన్నారు.

**పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో పూజలు**

బూర్గంపహాడ్, డిసెంబర్ 12: మండలంలోని నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామానికి వచ్చిన పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుకు కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు మంగళవారం రాత్రి స్వాగతం పలికి సత్కరించారు. అనంతరం ఆయన కాలినడకన సమీపంలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయాన్ని సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**ఎమ్మెల్యే పాయంను కలిసిన పాల్వంచ డీఎస్పీ**



ఎమ్మెల్యే పాయంకు మొక్కను అందజేస్తున్న పాల్వంచ డీఎస్పీ వెంకటేశ్

మణుగూరుటౌన్, డిసెంబర్ 12: పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును మంగళవారం స్వగృహంలో పాల్వంచ డీఎస్పీ వెంకటేశ్ కలిసి శుభాకాంక్షలు తెలిపి మొక్కను అందజేశారు.

**ఎమ్మెల్యే పాయంను కలిసిన కాంగ్రెస్ నాయకులు**

బూర్గంపహాడ్, డిసెంబర్ 12: పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును మండలంలోని సోంపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు మంగళవారం మణుగూరులో కలిసి శాలువా కప్పి సత్కరించారు. పాయంను కలిసిన వారిలో బోరె సంపత్, పండగ వెంకటేశ్వర్లు(వెంకటి), పొందు సాయిబు, క్రాంతికుమార్, పెంకె నాగేంద్రబాబు, బాగి సాయి, వరుణ్, బోరం ప్రమోద్, బోర శ్రీను, మున్నేటి సత్యనారాయణ, బింగి ఈశ్వర్, నస్కూరి శ్రీను ఉన్నారు.